క్లుప్తంగా

ఘనంగా సన్మానం



మణికుమార్‌ను సన్మానిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ పార్వతీపురం మన్యం జిల్లా మెంబర్‌గా నియమితులైన జలుమూరి మణికుమార్‌ను ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ గిరిజనులు, షెడ్యూల్ కులాల వారికి పథకాలు సక్రమంగా అమలయ్యేలా తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నిమ్మల సింహాచలం, మంచాల ఈశ్వరరావు, కోలక గౌరమ్మ, పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర రావు, పాలవలస భగవాన్, ఆర్.లవరాజు, జి.భవాని తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని భైరిపురం–పెదపెంకి మధ్యలో ఉన్న పైప్‌లైన్ మరమ్మతుల బారిన పడడంతో సర్పంచ్ పాపారావు దగ్గరుండి శుక్రవారం మరమ్మతులు చేయించారు. నాలుగురోజుల క్రితం ప్రైవేట్ జేసీబీ పైప్‌లైన్‌ను మట్టించడంతో దెబ్బతింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంటనే సిబ్బందితో మరమ్మతులు చేయించి గ్రామానికి తాగునీరు సరఫరా జరిగేలా చేశారు. దీంతో గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



కొండపేటలో పిచికారీ చేయిస్తున్న ఈవో శ్రీనివాస్

మక్కువ: మండలంలోని కొండపేట గ్రామంలో ఈవో బెహర శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యపనులు జరిపించారు. అలాగే ఏఎల్‌ఓ స్ప్రేయింగ్ చేయించి, బ్లీచింగ్ చల్లించారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎం.ఈశ్వరరావు ఆధ్వర్యంలో కొండపేటలో వైద్యశిబిరం నిర్వహించారు. మక్కువలోని పలు వీధుల్లో చేపట్టిన పారిశుద్ధ్యపనులను డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ ఆదినారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ప్రసాద్

సాలూరు: సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా (ఎఫ్ఏసీ) మున్సిపల్ డీఈఈ బీవీ ప్రసాద్‌ను నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాద్ గతంలోను ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా ఇక్కడి కమిషనర్ జయరాం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన నేపథ్యంలో ఎఫ్ఏసీగా ప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చిక్కుముడులు వీడేదెన్నడో?

- విద్యుత్ స్తంభాలకు చుట్టుకున్న కేబుల్ వైర్లు
- పొంచిఉన్న ప్రమాదం
- స్తంభం ఎక్కేందుకు లైన్‌మెన్‌కు ఇబ్బందులు



నారాయణపురంలో స్తంభానికి చుట్టిన కేబుల్‌వైరు



మిర్తివలస మార్గంలో విద్యుత్ స్తంభాలకు చుట్టిన వైర్లు



బల్లి వద్ద పంటపొలాల్లో స్తంభానికి చుట్టిన కేబుల్ వైర్లు

బలిజిపేట:

విద్యుత్ స్తంభాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సుమారు అన్ని స్తంభాలకు కేబుల్‌వైర్లు చుట్టలు చుట్టలుగా కనిపిస్తున్నాయి. విద్యుత్‌స్తంభాల ఆధారంగానే కేబుల్‌వైర్లు కట్టుకుంటున్నారు. అయినా విద్యుత్‌శాఖ అధికారులు కిమ్మనకపోవడం ఆశ్చర్యంగా కనిపిస్తోంది. వాటికి ఎటువంటి అనుమతులు లేవు. విద్యుత్ వినియోగం పెరుగుతుండడంతో స్తంభాలపై ఎప్పటికప్పుడు షార్ట్ సర్క్యూట్ అవుతునే ఉంటోంది. ఆ సమయంలో మంటలు కేబుల్‌వైర్లకు వ్యాపించే ప్రమాదముంది. అంతేకాకుండా కొన్ని సమయాల్లో తీగలు తెగిపడినప్పుడు అవి కేబుల్‌వైర్లపై పడితే ప్రమాదం వాటిల్లే ఆస్కారంఉంది. అంతేకాక కేబుల్ మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు ఆపరేటర్లు విద్యుత్‌స్తంభాలు ఎక్కినప్పుడు ఎటువంటి ప్రమాదాలైనా జరిగే పరిస్థితి ఉంది. ఆ సమయంలో ప్రమాదాలకు ఎవరు బాధ్యులవుతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

అనుమతుల మాటేంటి?

విద్యుత్ స్తంభాలకు చుడుతున్న కేబుల్ నెట్‌వర్క్ వైర్లు అనుమతులు తీసుకుని చుడుతున్నారా? లేదా అనేది ప్రశ్నార్థకం. విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు చుట్టడానికి అనుమతులు అవసరం, వాటికి సంబంధించి రుసుము చెల్లించాల్సి ఉంది. ఎటువంటి అనుమతులు లేకుండానే విద్యుత్ స్తంభాలకు వైర్లు చుడుతున్నారు. స్థానికంగా ఉండే విద్యుత్‌శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అనుమతులు ఉన్నాయా? లేదా? అనేది వారికే తెలియక మాకెందుకులే అని మౌనం వహిస్తున్నారనే చర్చ సాగుతోంది.

ఎవరూ అనుమతులు తీసుకోలేదు

విద్యుత్ స్తంభాలకు కేబుల్‌వైర్లు కట్టేందుకు మావద్ద ఎవరు అనుమతులు తీసుకోలేదు, ఎక్కడ తీసుకుంటున్న విషయం తెలియదు. సమస్య వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. – సింహాచలం, ఏఈ, విద్యుత్‌శాఖ, బలిజిపేట

ప్రధాన కూడళ్లలో సమస్య

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఆయా ప్రాంతాల్లోని లైన్‌మెన్ స్తంభాలు ఎక్కి సమస్యను పరిష్కరిస్తారు. అయితే కేబుల్‌వైర్లు చుట్టిన స్తంభాలు ఎక్కేందుకు లైన్‌మెన్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితి చాలాచోట్ల కనిపిస్తోంది. దీనిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

శుద్ధిచేసిన తాగునీరు పంపిణీ చేయాలి



సూరంపేటలో నీటి సరఫరాపై ఆరాతీస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: వర్షాకాలం రావడంతో మండల ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండలంలోని సూరంపేటలో సర్పంచ్ అప్పన్నమ్మ పర్యవేక్షణలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మురళి చేయిస్తున్న పారిశుధ్య పనులు, ఇంటింటికీ పంపిణీ అవుతున్న కుళాయి నీటి విడుదల, కాలువల్లో పూడిక తీత కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా ఇంటింటికీ ట్యాప్‌ల ద్వారా సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను, ఓవర్‌హెడ్‌ట్యాంక్ వద్ద నీటిని పరిశీలించారు. స్వచ్ఛజలాన్ని పంపిణీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలువల్లో తీసిన పూడికలను జనావాసాలు లేని ప్రాంతాల్లో డంప్ చేయాలని సూచించారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలియ జేశారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనదారులకు 200 రోజులు పనిదినాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్ వర్మ

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్ వర్మ

సీతానగరం: ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న వేతన దారులకు 200 రోజులు పనిదినాలు కల్పించి వేతనం రూ.600లు ఇవ్వాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్‌వర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని చిన భోగిలి గ్రామానికి వచ్చిన జీపుజాతా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉపాధి వేతనదారులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా వివిధరకాల వ్యవసాయ పనుల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఉపాధి వేతనదారుల నుద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వచ్చిన తర్వాత వ్యవసాయ పనులు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి పథకమే ఆసరాగా నిలబడి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అధికంగా పేదలను ఆదుకుంటోందన్నారు. ఉపాధిహామీ పథకంలో 100రోజుల నుంచి 200 రోజులకు పనిదినాలు పెంచాలని రోజు వేతనం రూ.600 చెల్లించాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణప్రాంతాల ప్రజలకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మథరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు, సీఐటీయూ ఉపాధ్యక్షురాలు వి.ఇందిర, గంట జ్యోతి, ఆర్.రాము, గవర వెంకటరమణ, సీహెచ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర ప్రారంభం

- ప్రత్యేక అలంకరణల్లో 9 రోజుల పాటు భక్తులకు దర్శనం



సాలూరు: పూజలందుకుంటున్న జగన్నాథస్వామి



బలిజిపేట: వేంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో పూజలందుకుంటున్న జగన్నాథ స్వామివారు



పార్వతీపురం టౌన్: పట్టణంలో స్వామివారి రథయాత్ర

సాలూరు: ఏడాదిపాటు గర్భగుడిలో ఉండి జగన్నాథస్వామి సోదర, సోదరీలైన సుభద్ర, బలభద్ర సమేతంగా తన మేనత్త ఇల్లైన గుండిచా మందిరానికి వెళ్లే అద్భుతమైన రథయాత్ర కార్యక్రమం సాలూరు పట్టణంలో శుక్రవారం వేడుకగా ప్రారంభమైంది. పట్టణంలోని వెంకటేశ్వరడీలక్స్ సమీపంలో గల జగన్నాథ స్వామి ఆలయం నుంచి జగన్నాథ రథ చక్రాలు కదిలాయి. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి రథయాత్రలో భాగంగా పట్టణంలోని వెంకటేశ్వరడీలక్స్ సమీపంలో గర్భగుడిలో ఉన్న జగన్నాథునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రమచంద్రసన్యాసిరాజు తొలిపూజ చేయగా అర్చకులు వినయ్, రాజు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం గర్భగుడిలో ఉన్న విగ్రహాలను రథం మీదికి తీసుకువచ్చి కోటవీధి జంక్షన్ మీదుగా స్వామి వారి మేనత్త ఉండే గుండిచాదేవి మందిరానికి తరలించారు. రథంలో వస్తున్న స్వామివారిని చూసేందుకు వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది. ఉత్సవ విగ్రహాలను కాకుండా నేరుగా గర్భగుడిలోని జగన్నాథుడి మూలవిరాట్టునే రథంలో తీసుకురావడం ఈ యాత్ర యొక్క ప్రత్యేకత అని భక్తులు చెబుతున్నారు. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి రథయాత్ర పట్టణంలో 9 రోజుల పాటు జరగనుంది. గుండిచా మందిరంలో ప్రత్యేక అలంకరణలలో తొమ్మిది రోజులు పాటు భక్తులకు స్వామివారు దర్శనమివ్వనున్నారు.



పార్వతీపురం రూరల్: ఎమ్మార్‌నగరంలో జగన్నాథస్వామి రథయాత్రలో పాల్గొన్న భక్తులు

ధ్రువీకరణ పత్రాలు అందక విద్యార్థుల తిప్పలు

- రెవెన్యూ కార్యాలయం వద్ద తప్పని నిరీక్షణ
- అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన
- ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి



తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థుల పడిగాపులు

మక్కువ:

విద్యాసంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తోంది. ఉన్నత చదువులు అభ్యసించేందుకు, కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. విద్యార్థులకు అవసరమైన కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కళాశాలలకు సమర్పించాలి. మరికొద్ది రోజుల్లో కళాశాలలో చేరాల్సి ఉంది. సమయం దగ్గరపడడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, సకాలంలో పనులు జరగకపోవడంతో, రెవెన్యూ కార్యాలయం అధికారులను సంప్రదిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో కూడా అధికారులు సరిగ్గా, పట్టించు కోవడంలేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ వెంటనే అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరాలి



స్పెషల్ డ్రైవ్‌లో విద్యార్థులను చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: మండలంలో విద్యాబోధనకు అవసరమైన మౌలిక సదుపాయాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించాలని మరిపివలస జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వి.తవిటి నాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని మరిపివలస ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్న సూరంపేట, చిన్నారాయుడుపేట గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం ఆయన అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యాబోధనకు అవసరమైన మౌలిక సదుపాయాలున్నాయని తెలియజేశారు. విద్యార్థుల పేరెంట్స్ పాఠశాలలను సందర్శించి తమ పిల్లలను జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని కోరారు, స్పెషల్ డ్రైవ్‌లో ఐదుగురు విద్యార్థులను పేరెంట్స్ సమక్షంలో చేర్పించామని హెచ్‌ఎం తెలియజేశారు. ఇప్పటికి 205 మంది విద్యార్థుల హాజరు ఉందన్నారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు,పేరెంట్స్ పాల్గొన్నారు.

బాలల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించాలి

- ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్‌మోహన్



జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు

పార్వతీపురం టౌన్: బాలల్లో ఆరోగ్య, శారీరక, మానసిక వైకల్యాలు, లోపాలను ముందుగానే గుర్తించాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురంలోని 21వ వార్డులో గల చిల్డ్రన్ కేర్ హోమ్‌లో జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని వైద్యబృందంతో కలిసి సందర్శించి పిల్లలకు చేపట్టిన వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ భరత్ చంద్ర వైద్య తనిఖీలు చేపట్టారు. పుట్టుక, ఎదుగుదలతో పాటు, వ్యాధులు, వైకల్యాలకు సంబంధించి లక్షణాలు ఏవైనా ప్రస్ఫుటమవుతున్నాయా అని పరీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా పుట్టుక, ఎదుగుదలలో లోపాలు, వ్యాధులు, వైకల్యంతో గుర్తించిన పిల్లలకు డీఈఐసీ కేంద్రంలో తగు చికిత్స, పర్యవేక్షణ చేసి గ్రహణం మొర్రికి శస్త్రచికిత్సలు చేయించామన్నారు. క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది సర్వే చేసి పిల్లల్లో ఇటువంటి సమస్యలను ముందుగానే గుర్తిస్తే సమస్యలను పరిష్కరించి బాలలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్‌ను అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో పిడియాట్రిషియన్ డా.ఎల్.భరత్ చంద్ర, వైద్యులు డా సౌజన్య, డీఈఐసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: పట్టణ శివారులో సీఐ మీసాల చంద్రమౌళి నేతృత్వంలో సిబ్బంది శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి పట్టణంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్నీ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్సై కె.ప్రయోగమూర్తి మాట్లాడుతూ.. వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

కార్మికచట్టాల రక్షణ కోసం జూలై 9న సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సాలూరు: దేశంలో కార్మికచట్టాల రక్షణ కోసం జూలై 9న జరుగుతున్న సమ్మెలో పాల్గొని సమ్మె జయప్రదం చేయడానికి కార్మికవర్గమంతా సిద్ధంగా ఉందని సీఐటీయూ నాయకులు తెలిపారు. సమ్మె నేపథ్యంలో చేపట్టిన జీపుజాతా బృందం పట్టణానికి శుక్రవారం చేరుకున్న సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు కూడలి బోసుబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు.బోసు బొమ్మ వద్ద సీఐటీయూ పట్టణ నాయకుడు శంకర్రావు అధ్యక్షతన నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు మాట్లాడుతూ దేశంలో కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను, మోడీ ప్రభుత్వం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని రకాల హామీలు అమలుచేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇందిర, జ్యోతి, రాము, రాముడు, స్వప్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

బలిజిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ ప్రధానకార్యదర్శి మన్మథరావు పిలుపునిచ్చారు. లేబర్‌కోడ్ రద్దుకోసం వచ్చేనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బలిజిపేటలో శుక్రవారం నిర్వహించిన జీపుజాతా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ఉపాధ్యక్షురాలు వి.ఇందిర, ఆవు సాంబమూర్తి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

మక్కువ: దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9 జరిగే సమ్మెలో కార్మిక వర్గమంతా పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు కోరారు. జీపుజాతాలో భాగంగా శుక్రవారం మక్కువ మండల కేంద్రానికి చేరుకున్న జిల్లా బృందానికి, స్థానిక సీఐటీయూ నాయకులు పవన్, తదితరులు స్వాగతం పలికారు.



మక్కువలో జీపుజాతా కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, ఇతర కార్మికులు



బలిజిపేట: జీపుజాతాలో మాట్లాడుతున్న మన్మథరావు

రోడ్డును అనుసరించే చెత్త డంపింగ్

- అవస్థలు పడుతున్న వాహన చోదకులు, స్థానికులు



రోడ్డును అనుకుని ఉన్న చెత్త నిల్వలపై డంప్ చేస్తున్న వాహనం



డంపింగ్ యార్డు వద్ద రోడ్డును ఆనుకుని ఉన్న చెత్త నిల్వలు

పార్వతీపురం రూరల్: అధికారంలోకి వచ్చిన వెంటనే పార్వతీపురం పట్టణాన్ని పట్టి పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల్లో ప్రధాన హామీ ఇచ్చిన కూటమి నేతలు కన్నెత్తి కూడా డంపింగ్ యార్డు వైపు చూడడం లేదు. గతంలో యార్డులోకి వెళ్లేందుకు రెండు రహదారులను ఏర్పాటు చేసి చెత్తసేకరణ వాహనాలు ఆ దారిగుండా లోపలికి వెళ్లి డంప్ చేసేవి. ప్రస్తుతం ఆ రెండు దారులు చెత్తతో నిండిపోయి రోడ్డుపైకి చెత్త వచ్చే పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు, ఆ రహదారిపై వచ్చి పోయేవారు అవస్థలు పడుతున్నారు. రోడ్డును ఆనుకుని చెత్త ఉండడంతో పశువులు అక్కడే సంచారం చేస్తూ రహదారికి అడ్డంగా నిలిచిపోతున్నాయని, అదేవిధంగా గాలివీచేటప్పుడు దుర్వాసనతో పాటు చెత్త ఎగిరి రోడ్డుపైకి వచ్చి, దుమ్ము, ధూళితో అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. అయితే సిబ్బంది చెత్త సేకరణ వాహనాల్లో తెచ్చిన నిల్వలు రోడ్డును అనుసరించి ఇప్పటికే ఉన్న నిల్వలపైనే డంప్ చేస్తున్నారు. లోపలికి పేరుకుపోయిన చెత్తను జేసీబీల సహాయంతో మళ్లించి యార్డు లోపలికి వాహనాలు వెళ్లేందుకు దారులు ఏర్పాటు చేసి చెత్తను రోడ్డుపైకి కాకుండా లోపలికి డంప్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.